
గిరిపై గురి

మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానంలో త్రిముఖ పోటీ

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్లు	
మేడ్చల్	6,58,190
మల్కాజిగిరి	4,99,538
కుత్బుల్లాపూర్	7,12,756
కూకట్‌పల్లి	4,71,878
ఉప్పల్	5,33,544
ఎల్బీనగర్	6,00,552
కంటోన్మెంట్	2,52,060



37,28,519 మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలో మొత్తం ఓటర్లు



పార్లమెంటు ఎన్నికలకు నగారా మోగడంతో దేశంలోనే అతిపెద్ద పార్లమెంటు నియోజకవర్గమైన మల్కాజిగిరిపై జెండా ఎగురవేసేందుకు ప్రధాన పార్టీలు సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. ప్రచారపర్వంలో దూకుడు పెంచాయి. ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు కూడా ఖరారు కావడంతో మల్కాజ్‌గిరిలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. బీజేపీ ఇప్పటికే రోడ్‌షోలు నిర్వహించి ఓటర్లను తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తోంది. ఇక బీఆర్ఎస్ పార్టీ కూడా ప్రచారంలో దూకుడు పెంచింది.

సీఎం రేవంత్‌కు ప్రతిష్ఠాత్మకం

- అక్కడి నుంచే ఆయన ప్రాతినిధ్యం
- బీజేపీ ఆశలూ దానిపైనే..
- ఇప్పటికే మోదీ, అమిత్‌షా రోడ్‌షోలు
- దూకుడు పెంచిన బీఆర్ఎస్
- పార్లమెంటు పరిధిలో వేడెక్కిన రాజకీయం







మేడ్చల్ మార్చి22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మల్కాజిగిరి పార్లమెంటు స్థానంపై జెండా ఎగరవేసేందుకు మూడు ప్రధాన పార్టీలు పోటీపడుతున్నాయి. ఎలాగైనా మల్కాజిగిరి స్థానాన్ని కైవసం చేసుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. బీజేపీ నుంచి ఈటెల రాజేందర్, బీఆర్ఎస్ నుంచి రాగిడి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నుంచి పట్నం సునీతామహేందర్‌రెడ్డిల పేర్లు ఖరారయ్యాయి. మల్కాజిగిరి లోక్‌సభ స్థానం కోసం ప్రధాన పార్టీలు సరికొత్త వ్యూహాలతో ముందుకెళ్తున్నాయి. బీజేపీ అభ్యర్థి తరఫున ఇప్పటికే ప్రధానమంత్రి మోదీ, అమిత్‌షాలు రోడ్‌షోలు నిర్వహించారు. ప్రతి శాసనసభ నియోజకవర్గంలో కొంత మంది నాయకులతో కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉండటంతో క్షేత్రస్థాయిలో ప్రచారంపై ఆపార్టీ దృష్టి పెట్టింది. వందరోజుల్లో తాము అమలు చేసిన పథకాలు, అభివృద్ధి పనులు, చేపట్టబోయే పనుల గురించి ఓటర్లకు వివరించేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధమవ్వగా , వంద రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఓటర్లకు వివరించాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. బీజేపీ నేతలు కేంద్ర ప్రభుత్వ పథకాలపైనే ఎక్కువగా ఆధారపడుతూ , ప్రధాని మోదీతో పాటు అమిత్ షా వంటి నేతలు ఇప్పటికే సభలు, రోడ్‌షోలు నిర్వహించి ఓటర్లను తమవైపు తిప్పుకోవాలని అనుకుంటోంది. ఈటల రాజేందర్‌పై సానుభూతి కూడా ఆ పార్టీకి కలిసొచ్చే అంశంగా చెప్పుకోవచ్చు.

మూడు జిల్లాలు.. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు

నగరంతో పాటు శివారు జిల్లాలైన మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను కలిగి ఉన్న మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తుండటంతో రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. మేడ్చల్, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, కంటోన్మెంట్, ఎల్బీనగర్, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో విస్తరించి ఉన్న మల్కాజిగిరి ఎంపీ పరిధిలో 37,28,519 ఓటర్లు ఉన్నారు. తెలంగాణలోనే మల్కాజిగిరి పార్లమెంటు స్థానాన్ని ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ కీలక నేతల సమావేశంలో ఆయన పాల్గొని దిశా నిర్దేశం చేశారు. ఈ ఎన్నికల్లో కష్టపడే నేతలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. నియోజకవర్గ ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కూడా సమావేశాలు నిర్వహిస్తూ ప్రచార దూకుడు పెంచాలని పార్టీ శ్రేణులకు సూచిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్ ప్రచారంలో ముందున్నారు. పార్టీమెంటు పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశాలు, బస్తీలు, పురపాలక సంఘాలు, డివిజన్లు, గ్రామాల వారీగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. అయోధ్యలో రామమందిరం, కేంద్ర పథకాల గురించి ఓటర్లకు వివరిస్తున్నారు. ఇక బీఆర్ఎస్ పార్టీ కూడా ప్రచార దూకుడు పెంచింది. ఆ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ఇటీవలనే మాజీ మంత్రి మల్లారెడ్డి నివాసంలో నియోజకవర్గ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలో హోరాహోరీగా ప్రచారం నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

- జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్, మార్చి 22: జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు బాధ్యతగా పని చేయాలని, పూర్తి అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. శుక్రవారం వికారాబాద్ నియోజకవర్గ ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులు చాలా కీలకమైనవని, ఎక్కడ ఏ చిన్న తప్పిదానికి తావు ఇవ్వకుండా విధులు నిర్వహించాలన్నారు. సువిధ యాప్ ద్వారా అనుమతులు జారీ చేయాలని, రవాణా కార్యాచరణ పకడ్బందీగా చేయాలన్నారు. సి విజిల్ యాప్ ద్వారా, 1950 టోల్ ఫ్రీ లేదా కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదులు చేస్తే 15 నిమిషాల్లోనే స్పందించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, తహసీల్దార్లు సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.



మేరి ఏ నాట్స్ పాఠశాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఈవీఎంలు భద్ర పర్చేందుకు ఏర్పాట్లు చేయాలి

పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా జిల్లాలో వికారాబాద్ నియోజకవర్గానికి కేటాయించిన ఈవీఎంలను భద్రపరిచేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం డిస్ట్రిబ్యూషన్, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటుకు జిల్లా కేంద్రంలోని మేరీ ఏ నాట్స్ పాఠశాలను పరిశీలించారు. అదనపు కలెక్టర్‌తో పాటు డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, మునిసిపల్ కమీషనర్ జాకీర్ అహ్మద్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

నీటికోసం వెళ్లి విద్యార్థి మృత్యువాత

వాటర్‌క్యాన్ ఇచ్చి పంపిన ఉపాధ్యాయుడు

- ఆర్టీసీ బస్సును ఢీకొన్న విద్యార్థి.. నవాబుపేటలో ఘటన

వికారాబాద్, మార్చి 28: ఉపాధ్యాయుడు వాటర్ క్యాన్‌లో నీటిని తెమ్మని పంపగా ఆర్టీసీ బస్సు ఢీకొని విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన నవాబుపేట మండల కేంద్రంలో పరిధిలో చోటు చేసుకుంది. ఆర్కతల గ్రామానికి చెందిన కె.కార్తీక్(14) నవాబుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. రోజూ మాదిరిగానే శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లాడు. ఉపాధ్యాయుడు బుచ్చిరెడ్డి మండల కేంద్రం సమీపంలోని వాటర్ ప్లాంట్ వద్ద వాటర్ క్యాన్‌లో నీటిని తేవాలని కార్తీక్‌కు తన బైక్‌ను ఇచ్చాడు. దీంతో కార్తీక్ తనతో పాటు మరో విద్యార్థి వడ్డే వేణును వెంట తీసుకెళ్లాడు. ప్లాంట్ వద్ద వాటర్ క్యాన్‌ను పెట్టి, బైక్‌పై వెళ్తున్న క్రమంలో పులుమామిడి నుంచి నవాబుపేటకు వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నారు. ఈ సంఘటనలో కార్తీక్‌కు తీవ్రగాయాలు కాగా, వడ్డె వేణుకు స్వల్పగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఇద్దరిని వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కార్తీక్ మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నవాబుపేట పోలీసులు తెలిపారు.



కార్తీక్ (ఫైల్)

యాసిన్ క్లినిక్ సీజ్

- ఆస్పత్రి నిర్వహణకు ఎలాంటి అర్హతలూ, అనుమతులు లేవు
- విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తాం : డిప్యూటీ డీఎంహెచ్‌వో



క్లినిక్‌ను సీజ్ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో జీవరాజ్

పరిగి, మార్చి 22: పరిగిలోని యాసిన్ ఫస్ట్‌ఎయిడ్ క్లినిక్ చేసినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ జీవరాజు, డాక్టర్ రవీంద్ర, డిప్యూటీ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 20న బుధవారం దోమ మండలం ఊటుపల్లి గ్రామానికి బంటుశ్రీనివాస్, పరిగిలోని యాసీన్ క్లినిక్‌కు చికిత్స కోసం వచ్చిన మృతి చెందిన సంగతి విదితమే. ఈ మేరకు వైద్యాధికారులు బృందం పరిగిలోని యాసిన్ క్లినిక్ సందర్శించి విచారణ జరిపారు. శ్రీనివాస్ మృతికి గల కారణలు తెలుసుకున్నారు. పరిగికి చెందిన ఎండీ గఫార్ నిర్వహించే యాసిన్ క్లినిక్ నిర్వహణకుగాని, అల్లోపతి వైద్యం చేయడానికి ఏటువంటి అర్హతలు, అనుమతులు లేవని గుర్తించినట్లు తెలిపారు. ఇక నుంచి వైద్యం చేయకూడదని, క్లినిక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. విచారణ నివేదికను కలెక్టర్, ఆరోగ్యశాఖ డైరెక్టర్‌కు సమర్పించడం జరుగుతుందని తెలిపారు.

జిల్లా గ్రీవెన్స్ కమిటీ నియామకం

మేడ్చల్ మార్చి 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న దృష్ట్యా పరిమితికి మించి రూ. 50 వేలనగదు, బంగారు , ఇతర ఆభరణాలు తరలిస్తే ఆధారాలు వెంట ఉంచుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. పోలీసు, సర్వేలెన్స్ బృందాలు స్వాధీనం చేసుకున్న నగదు, నగలకు సంబంధించి ఆధారాలు ఉంటే పరిశీలించి విడుదల చేస్తామన్నారు. ఇందుకు సంబంధించిన తన ఆధ్వర్యంలో కమిటీ మెంబర్ కన్వీనర్‌గా జిల్లా సహకార అధికారి (డీసీవో) రాజేందర్‌రెడ్డి, సభ్యులుగా జడ్పీ సీఈవో దిలీప్ కుమార్, జిల్లా ఇన్‌చార్జి ఆడిట్ అధికారి యాదగిరిలతో జిల్లాస్థాయి గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని ఆధారాలుంటే రూ. 10 లక్షలలోపు నగదు 24 గంటల్లో విడుదల చేస్తారని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసే వరకు ఆధారాలు లేకుండా ఎక్కువ మొత్తంలో నగదు తీసుకెళ్తూ పట్టుబడితే సీజ్ చేసి డిపాజిట్ చేస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ అధికారులు ప్రతిరోజు సాయంత్రం 4గంటలకు కలెక్టరేట్‌లో అందుబాటులో ఉంటారని తెలిపారు.

నాలుగు నెలలుగా జీతాల్లేవ్

- ప్రభుత్వాస్పత్రి కాంట్రాక్ట్ సిబ్బంది ధర్నా



ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

ఘట్‌కేసర్, మార్చి 22 : నెలల తరబడి వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తే ఎలా బతికేదని ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రి కాంట్రాక్టు సిబ్బంది ఆందోళనకు దిగారు. శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విధులను బహిష్కరించి ఆసుపత్రి ఆవరణలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లూరి జయచంద్ర, కార్మికులు మాట్లాడారు. 25మంది సిబ్బంది కాంట్రాక్టు పద్ధతిపై 20 ఏళ్లుగా ఆస్పత్రిలో పనిచేస్తురని, నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ విధిగా కల్పించాల్సి ఉన్నా, ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రికి చెందిన సాయి సెక్యూరిటీ సంస్థ యాజమాన్యం ఏమాత్రం పట్టించు కోకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఇళ్ల అద్దెలు చెల్లించలేని పరిస్థితి నెలకొందన్నారు. ఫీజులు చెల్లించక పోవడంతో తమ పిల్లలకు పాఠశాలలకు రానివ్వడం లేదని పలువురు సిబ్బంది కన్నీటి పర్యంతమయ్యారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్, అధికారులు స్పందించి తమకు తక్షణమే తమకు రావాల్సిన జీతాలు చెల్లించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగ్యమ్మ, శివమ్మ, నాగమ్మ మెహ్రూనిసా, పుష్ప, బాలమణి, కృష్ణ, రవి, సత్యనారాయణ, లక్ష్మి, ప్రేమమ్మ, ఊర్మిళ, ఇందిర, ప్రేమలత, లుథియ, స్వేత, విమల తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ పదవుల్లో సీనియర్లకు నిరాశ

- కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన నేతలు నారాజ్
- మైనార్టీలను ఏకం చేసిన నాయకుడికి తప్పని నిరీక్షణ
- గ్రూపు రాజకీయాలకు ఊతం
- బీఆర్ఎస్ పరిస్థితే కాంగ్రెస్‌కు తప్పదంటున్న రాజకీయ మేధావులు

మొండిచేయి!

నామినేటెడ్ పదవుల్లో వికారాబాద్ ప్రాంతానికి దక్కని చోటు



వికారాబాద్, మార్చి 22 : ప్రభుత్వం ప్రకటించిన 37 మంది కార్పొరేషన్ చైర్మన్ పదవుల నియామకాల్లో వికారాబాద్ ప్రాంతానికి మొండిచెయ్యి ఎదురైంది. వికారాబాద్ నియోజకవర్గం నుంచి ఒక్కరికి కూడా కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో స్థానం కల్పించలేదు. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన నాయకులతో పాటు చాలా కాలంగా పార్టీని నమ్ముకుని జెండాను భుజాలపై మోస్తున్న సీనియర్ నాయకులకు నిరాశే ఎదురైంది. పార్టీ కోసం కష్టపడిన తమను కనీసం పట్టించుకోలేదన్న ఆవేదన వారిలో వ్యక్తమవుతోంది. వికారాబాద్ ప్రాంతం నుంచి ఎంతో మంది సీనియర్ నాయకులు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన వారు ఉండగా వారిలో కొందరికైనా ఈసారి కార్పొరేషన్ పదవులు దక్కుతాయని కాంగ్రెస్ శ్రేణులు భావించారు. వికారాబాద్ జిల్లా నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తుండడంతో ఈ ప్రాంతానికి కార్పొరేషన్ పదవుల్లో పెద్దపీట వేస్తారని ఆశించారు. అయితే అందుకు విరుద్ధంగా వికారాబాద్ ప్రాంతం నుంచి ఒక్కరికి కూడా ప్రభుత్వం కార్పొరేషన్ పదవుల్లో అవకాశం కల్పించక పోవడంతో ఆశావహులైన సీనియర్ నాయకుల్లో తీవ్ర నిరాశా నిస్పృహలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ కోసం కష్టపడిన తమను కనీసం పట్టించుకోలేదన్న ఆవేదన వారిలో వ్యక్తమవుతోంది. ముఖ్యంగా సీనియర్ నాయకులు మునిసిపల్ మాజీ చైర్మన్ విశ్వనాథం సత్యనారాయణ, కిషన్ నాయక్, సుధాకర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రఘువీరారెడ్డి, రత్నారెడ్డి, ఎర్రవల్లి జాఫర్, గుడిసె లక్ష్మణ్‌తో పాటు ఎన్నికల సమయంలో పార్టీలోకి వచ్చిన పలువురు నాయకులు సైతం తమకు కార్పోరేషన్ పదవుల్లో స్థానం కల్పించే అవకాశం ఉంటుందని భావించారు. ఇందులో ఏ ఒక్కరికీ అయినా చైర్మన్ లేదా రాష్ట్ర స్థాయి పదవి వచ్చి ఉంటే బాగుండేదని పార్టీ నాయకులు అభిప్రాయ పడుతున్నారు. ఇదిలా ఉంటే, వికారాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయంలో మైనార్టీలు కీలక పాత్ర పోషించారు. మైనార్టీలను ఏకం చేయడంలో వికారాబాద్ మండల వాసి ఎర్రవల్లి జాఫర్ ఎనలేని కృషి చేసినా చివరకు నిరాశే ఎదురైందని సన్నిహితువల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లుగా తెలుస్తోంది.

గ్రూపు రాజకీయాలకు అవకాశం

పార్టీలు వేరైనా ఇప్పటికే జిల్లాలో స్పీకర్ ప్రసాద్ కుమార్‌వర్గంతో పాటు పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి వర్గాలు బలంగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది ఎన్నికల సంవత్సరం కావడంతో అధికార పార్టీలో గ్రూపు రాజకీయాలు పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. ఎవరికి వారు తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకునే విధంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. నేతల మధ్య నెలకొన్న ఆధిపత్యపోరు పార్టీకి ఇబ్బందికరంగా మారే అవకాశం పొంచి ఉంది. లోక్‌సభ ఎన్నికల తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్న తరుణంలో ఈ గ్రూపు రాజకీయాలు మరింత పెరిగే అవకాశం ఉంది. నామినేటెడ్ పదవులతో పాటు స్థానిక సంస్థల్లో పోటీ చేసే అవకాశం, పార్టీ పదవుల కోసం ఈ వర్గాల మధ్య గట్టి పోటీ ఏర్పడి మళ్లీ గ్రూపు రాజకీయాలు కాంగ్రెస్‌లో మొదలయ్యే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు

ఎంపీ రంజిత్ రెడ్డి చేరికతో పెరగనున్న వలసలు

ఇదిలా ఉంటే, చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆయన మద్దతుదారులు చాలా వరకు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. వారిలో కొందరు బీఆర్ఎస్ నాయకులు ఉంటే, కాంగ్రెస్ పార్టీలో పని చేసి అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్‌లోకి వెళ్లిన నాయకులు కొందరు ఉన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీని విడిచి వెళ్లిన నాయకులను కాంగ్రెస్‌లోకి రానివ్వకుండా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కొందరు అడ్డుకట్ట వేస్తే ప్రస్తుతం వారు ఎంపీ ద్వారా కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు మార్గం సిద్ధం చేసుకుంటున్నారు.

ఎన్నికల సమయంలో పార్టీలో చేరిన నాయకులు సైలెంట్!

ఇదిలా ఉంటే, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు ప్రస్తుతం సైలెంట్‌గా కనిపిస్తున్నారు. కారణం ఏమిటో తెలియదు కానీ పార్టీలో వారు అంటీ ముట్టనట్లుగా వ్యవహరిస్తూ వస్తున్నారు. పదవుల పంచాయతీ జోలికి పోకుండా తమ పనులు తాము చేసుకోవడమే ఉత్తమం అన్నట్లుగా వారు వ్యవహరిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఎన్నికల సమయంలో తమను ఎంతో ఆప్యాయంగా పలకరించిన నేతలు ఇప్పుడు తమ పట్ల అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆవేదన వారిలో వ్యక్తమవుతోంది. తమకు పనులు చేసిపెట్టకున్నా కనీసం పలకరిస్తే బాగుండని వారు భావిస్తున్నారు. పార్టీలో చాలా కాలంగా కొనసాగుతున్న నాయకులతో పాటు తమను కూడా ముఖ్య నేతలు గుర్తించాలని వారు కోరుకుంటున్నారు.

బీఆర్ఎస్ పరిస్థితే కాంగ్రెస్‌కు..

పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ అవలంబించిన తీరునే ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ అవలంభిస్తోందని రాజకీయ మేధావులు అభిప్రాయ పడుతున్నారు ప్రతిపక్షం అనేది లేకుండా ఇష్టానుసారంగా ఇతర పార్టీలకు చెందిన నాయకులను చేర్చుకోవడం పార్టీకే నష్టమని అంటున్నారు. గతంలో వలసలను ప్రోత్సహించి ఇతర పార్టీల నాయకులను చేర్చుకున్న కారు (బీఆర్ఎస్) నిండి ఒకే సారి షెడ్డుకు పోయే పరిస్థితి ఏర్పడిందని.. అదే పరిస్థితి కాంగ్రెస్ పార్టీ తెచ్చుకునే విధంగా వ్యవహరిస్తున్నదని వారు చెబుతున్నారు. పార్టీ కోసం పని చేసిన నాయకులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ఆ తరువాత వలస వచ్చిన వారికి స్థానం కల్పించాలని కాంగ్రెస్ నేతలు కోరుకుంటున్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా వ్యవహరిస్తుందో తెలియాలంటే వేచి చూడాల్సిందే మరి.

పూడూరులో పోలీసు కవాతు



పూడూరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పూడూరు, మార్చి 22: మండల కేంద్రంలో పోలీసు కవాతు నిర్వహించారు. పోలీసులు పూడూరులోని పురవీధుల గుండా శుక్రవారం కవాతు నిర్వహించి అవగాహన కల్పించారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసమే ఈకవాతు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిగి సీఐ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.



ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు

ఇబ్రహీంపట్నం, మార్చి 22 : తుక్కుగూడ మున్సిపాలిటీలోని శ్రీనగర్ లోగల శ్రీ ఆదిలక్ష్మి అలివేలుమంగ సమేత శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి వార్షిక తిరు కల్యాణోత్సవాలు మూడు రోజుల పాటు వైభవంగా జరుగనున్నాయి. గురువారం రాత్రి మంకాల్ గ్రామం నుంచి శ్రీనగర్ దేవునిగుట్టవద్దకు అశేష భక్త జనం మధ్య మాజీ హోంమంత్రి టి. దేవేందర్‌గౌడ్ కుటుంబసభ్యులు పల్లకిపై స్వామివారి ఉత్సవ విగ్ర హాలను గుట్టపైకి తీసుకువచ్చారు. ఉత్సవాల్లో భాగంగా అలయ వంశపారంపర్య ధర్మకర్తలు శేషం జగన్నాథాచార్యులు, సింహాచార్యులు భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మాజీ హోంమంత్రి టి. దేవేందర్‌గౌడ్, విజయేందర్‌గౌడ్, వీరేందర్‌గౌడ్,మధుమోహన్‌గుప్త పాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలు చేపట్టాలి



దోమల మందు పిచికారి చేస్తున్న వైద్య సిబ్బంది

మర్పల్లి, మార్చి 22: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని హెల్త్ సూపర్‌వైజర్ అమరేశ్వరి అన్నారు. డెంగ్యూతో బాలుడు మృతి చెందిన ఘటనతో వైద్యాధికారులు స్పందించారు. మండలంలోని రావుల్‌పల్లి గ్రామంలో శుక్రవారం భుజంగం ఇంటి దగ్గర పంచాయతీ, వైద్య సిబ్బంది బాలుడి మృతి సంఘటనపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇంటి పరిసర ప్రాంతాల్లో దోమల మందును పిచికారిచేసి పారిశుధ్య పనులు చేపట్టారు. వైద్యాధికారులు గ్రామస్థులతో మాట్లాడుతూ వర్షాకాలం, శీతాకాలం అనే తేడా లేకుండా పారిశుధ్యం పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి చుట్టు పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. దోమల బెడద అధికంగా ఉంటే పంచాయతీ సిబ్బందికి, ఏఎన్‌ఎంలకు సమాచారం అందించాలన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి స్వప్న, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది ఉన్నారు.

నరేంద్ర మోదీతోనే దేశాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు, మార్చి 22: భారత ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. తాండూరులోని మర్వాడీ సంఘాల సమాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం కోసం ధర్మం కోసం బీజేపీకి ఓటేయాలని పిలుపునిచ్చారు. దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ప్రధాని మోదీకి మద్దతుగా అందరం కలిసికట్టుగా పార్లమెంటు ఎన్నికల్లో సత్తాచాటాలన్నారు. మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతోందన్నారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పేద, బడుగువర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. చేవెళ్ల పార్లమెంటు స్థానంలో అత్యధిక మెజార్టీతో బీజేపీ విజయ ఢంకా మోగించడం ఖాయమన్నారు. ఎన్నికల సమయంలో ప్రజల ముందుకు వచ్చే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు ఓటు వేస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసగించిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ సాయం లేనిది తెలంగాణలో అభివృద్ధి జరిగే అవకాశం లేదన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే కేంద్రం నుంచి ఎక్కువ నిధులు తీసుకొచ్చి చేవెళ్లను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కులమతాలకతీతంగా యావత్ భారతదేశాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రధాని మోడీ ముందుకెళ్తున్నట్లు గుర్తు చేశారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అనేక నిధులను మంజూరు చేసిందన్నారు. 2014 ముందు దేశంలో అవినీతి మాత్రమే ఉండేదన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ ఓటు బ్యాంకును చీల్చడం ఎవరితరం కాదని, పార్లమెంట్ ఎన్నికల్లో పక్కాగా బీజేపీదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బాలేశ్వర్ గుప్తా, భద్రేశ్వర్, శ్రీలత, ఉప్పరి రమేష్, మార్వాడి సంఘాల నాయకులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో పంచాయతీలు



అన్నారం గ్రామ పంచాయతీ

కొడంగల్ రూరల్, మార్చి 22: సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా సంబంధిత అధికారులకు చెక్ పవర్ కల్పించలేదు. గతంలో సర్పంచ్‌లు సొంత డబ్బులు ఖర్చులు చేసి ఆ తర్వాత బిల్లులు పెట్టుకునేవారు. ఇప్పుడు ప్రత్యేక అధికారులు తమ సొంత డబ్బులు ఖర్చు చేయడానికి ముందుకు రాకపోవడంతో సమస్యలు ఎక్కడికక్కడ ఉంటున్నాయి. నిధులు డ్రా చేసే అవకాశం లేకపోవడంతో పంచాయతీలు ఆర్థికంగా సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చినప్పటికీ చెక్‌పవర్, డిజిటల్ కీ ఇవ్వడంలో జాప్యం జరుగుతుంది. ఒక్కో గెజిటెడ్ అధికారికి రెండు, మూడు గ్రామాల ఇంచార్జ్ బాధ్యతలను అప్పగించడంతో బ్యాంకులో అడ్డంకీగా మారుతుందని అధికారులు చెబుతున్నారు. దీంతో కొడంగల్ మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో పాలన పట్టు తప్పుతుంది.

పాలనకు ఆటంకం

ప్రతీ నెల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 15వ ఆర్థిక సంఘం నిధుల కింద పీఎఫ్‌ఎంఎస్, ఎస్‌ఎఫ్‌సీ, జనరల్ ఫండ్ నిధులను మంజూర్ చేస్తుండగా వాటిని సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు వారికి ఉన్న చెక్ పవర్ ద్వారా అవసరాల మేరకు నిధులను వినియోగించుకునేవారు. ప్రస్తుతం ఆ అధికారాలను ప్రత్యేకాధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వాహణ, తాగునీటి పైపులైన్ మరమ్మతులు, వీధి దీపాల నిర్వాహణకు చెల్లింపులు చేయలేకపోతున్నామని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ బిల్లుల చెల్లింపులు, పంచాయతీ కార్యదర్శులకు వేతనాలు, ట్రాక్టర్ కిస్తులు చెల్లించడం ఇబ్బందికరంగా మారిందని, అధికారులు స్పందించి వెంటనే చెక్ పవర్ వచ్చేలా చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.



శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న కల్వ సుజాత

వైశ్య కార్పొరేషన్‌కు రూ.1000కోట్లు కేటాయించాలి

తాండూరు, మార్చి 22: వైశ్య కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కల్వ సుజాత ప్రభుత్వాన్ని కోరారు. తాండూరు పట్టణం ఆర్యవైశ్య సంఘంలో సంఘం ప్రతినిధులు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. పదేళ్ల పోరాటం తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వంలో వైశ్య కార్పొరేషన్ ఏర్పాటైందని అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో వైశ్య కార్పొరేషన్‌ను తానే చేర్పించానని తెలిపారు. ఈ కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని సీఎం కేసీఆర్‌ను కోరినట్లు చెప్పారు. దీని ద్వారా చిన్నచిన్న వ్యాపారులకు రుణ సౌకర్యం, పేద విద్యార్థుల ఉన్నత చదువులకు రుణం ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వైశ్య కార్పొరేషన్‌కు సంబంధించి విధివిధానాలు ఇంకా ఖరారు కాగానే మొదటగా తాండూరు నుంచి పేద వైశ్యులకు సాయం అందిస్తామని తెలిపారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాటికొండ స్వప్న పరిమళ్, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ కొత్రిక విజయలక్ష్మి, యాలాల ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కటికం వీరేందర్, ప్రధాన కార్యదర్శి కోట మురళీకృష్ణ, నగరేశ్వర దేవస్థాన ఛైర్మన్ కుంచం మురళీధర్ పాల్గొన్నారు.

మహేశ్వరంలో బీఆర్‌ఎస్ ఖాళీ



మాట్లాడుతున్న జడ్పీ ఛైర్‌పర్సన్ అనితాహరినాథ్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, మార్చి 22 : మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ను ఖాళీ చేసి కాంగ్రెస్‌దే పై చేయిగా నిలపాలని రంగారెడ్డి జడ్పీ ఛైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా చేవెళ్ల ఎంపీ సీటు కాంగ్రెస్‌దేనని ఆమె చెప్పారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపాలిటీలోని సర్దార్‌నగర్‌లో నిర్వహించిన మహిళా కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశంతో పాటు ఆ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో అనితారెడ్డి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు చేరవేయడంలో కార్యకర్తలు ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. మహిళా లోకమంతా హస్తం వైపే ఉన్నారని, బస్సుల్లో ఉచిత ప్రయాణంతో పాటు అభయహస్తం వంటి పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ పార్టీకి చెందినవారైనప్పటికీ రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు. కార్యకర్తలకు ఎలాంటి అవసరం ఉన్నా సమన్వయంతో కలిసి కట్టుగా పరిష్కరించుకుని ముందుకు సాగుదామన్నారు. కష్టపడే కార్యకర్తలకు కాంగ్రెస్ అన్యాయం చేయదని, నియోజకవర్గంలో పార్టీకి పూర్వవైభవం తేవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కెఎల్‌ఆర్, ఏనుగు జంగారెడ్డి, జి. జానకీరామ్, సమత తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీవో వాసుచంద్ర

భూకబ్జా వివాదం.. ఆర్డీవో పరిశీలన

దోమ, మార్చి 22: మండలంలోని తిమ్మాయిపల్లిలో గల సర్వేనెంబరు 50లో కబ్జా విషయంలో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు శుక్రవారం వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర పరిశీలించారు. గ్రామానికి చెందిన రాములమ్మకు ఎకరా తొమ్మిది గుంటల భూమి ఉంది. అట్టి భూమిని 2018 సంవత్సరంలో అయూబ్ అనే వ్యక్తికి విక్రయించింది. ఓ భూమి చూపి మరొక భూమి పట్టాచేసి ఇచ్చినట్లు కొన్ని సంవత్సరాలుగా ఇరువర్గాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు ఆర్డీవో తెలిపారు. భూసమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని లేదా కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలే తప్ప దాడులకు పాల్పడటం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పురుషోత్తం, ఆర్ఐ సుదర్శన్, రైతులు పాల్గొన్నారు.

రేపు బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమావేశం

ఇబ్రహీంపట్నం, మార్చి 22 : రేపు (ఆదివారం) నిర్వహించబోయే బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశానికి మండలం నుంచి అన్ని గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు భారీగా తరలి విజయవంతం చేయాలని జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ ఎస్ సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ ఛైర్మన్ డి.చంద్రశేఖర్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మన్నె జయేందర్‌ముదిరాజ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లెలగూడలోని సామ యాదిరెడ్డి గార్డెన్‌లో ఆదివారం ఉదయం 10గంటలకు మాజీ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందని, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని పార్టీ శ్రేణులు హజరు కావాలని కోరారు. సమావేశంలో ఎంపీటీసీ కాకి రాములు, డైరెక్టర్లు పొట్టి ఆనంద్, సామ ప్రకాశ్‌రెడ్డి, ఎస్ శేఖర్‌రెడ్డి, నాయకులు తాండ్ర దేవేందర్, పర్వదతాలుయాదవ్, సామయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జంగారెడ్డి, సురేందర్‌రెడ్డి



రేగడిచిల్కమర్రిలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

గ్రామాభివృద్ధికి సహకరిస్తా

▸ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

కొందుర్గు, మార్చి 22: రేగడి చిల్కమర్రి గ్రామాభివృద్ధికి సహకరిస్తానని కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆ గ్రామానికి చెందిన చెరుకుపల్లి సురేష్ గ్రామస్థుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్‌ను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ రేగడి చిల్కమర్రి తన సొంత ఊరు షేర్ అప్పారెడ్డిపల్లి లాంటిదని, తనకు ఈ గ్రామంతో ప్రత్యేక అనుబంధం ఉందని చెప్పారు. వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, వీరేందర్‌రెడ్డి, శ్రీరామ్, చిన్నఎల్కిచర్ల మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఖలీంకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు దామోదర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.



కులకచర్ల చౌరస్తాలో రోడ్డుపై నిలిపిన వాహనాలు

రోడ్డుపైనే పార్కింగ్.. తరచూ ప్రమాదాలు

కులకచర్ల, మార్చి 22: మండల కేంద్రంలోని చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేయడంతో తరచూ ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో వాహనాలు, తోపుడు బండ్లు రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ నిలపడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. చౌరస్తాలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. చౌరస్తా నుంచి నాలుగుదారులు పరిగి, నంచర్ల, పాంబండ, కులకచర్ల దారిలో ప్రైవేట్ వాహనాలు, ఆటోలు, జీపులు, డీసీఎంలు, బైక్‌లు అడ్డగోలుగా పార్క్ చేస్తున్నారు. తోపుడు బండ్లు, కూరగాయల దుకాణాలు రోడ్డుపై ఏర్పాటు చేశారు. దీంతో బస్సులు, లారీలు వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యతో గురువారం లారీ బైక్‌ను ఢీకొట్టి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. చౌరస్తాలో ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వాహనాలు తనిఖీ చేస్తున్న ఎంవీఐ సిబ్బంది

▸ అనుమతి లేని బస్సులపై కేసు

చేవెళ్ల, మార్చి 22 : నిబంధనలు పాటించని బస్సులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంవీఐ కిరణ్ హెచ్చరించారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో గురువారం ఎంవీఐ సిబ్బంది పాఠశాలల బస్సులను తనిఖీ చేసి సరైన అనుమతులు లేకుండా నడుస్తున్న నాలుగు బస్సులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ పాఠశాలల బస్సులు నడిపే డ్రైవర్లు తప్పకుండా అన్ని అనుమతులు తీసుకోవాలన్నారు. పర్మిషన్‌తో పాటు ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ తదితర సర్టిఫికెట్లు తీసుకొని బస్సులు నడుపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ సిబ్బంది పాల్గొన్నారు.

సౌరశక్తితో నూతన ఆవిష్కరణలు చేపట్టాలి



ప్రొఫెసర్ కృష్ణవేధ్‌ను సత్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ నల్ల దివ్య

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 22: విద్యార్థులు సౌరశక్తిని వినియోగించుకుని నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని అమెరికా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కృష్ణవేదుల అన్నారు. మండలంలోని కాచవానిసింగారం, దివ్యానగర్‌లోని నల్లమల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 'సస్టైనబిలిటీ క్లైమేట్ చేంజ్' అనే అంశంపై జరిగిన జాతీయస్థాయి టెక్నికల్ ఫెస్ట్ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ విద్యార్థులు నిత్యం పరిశోధనలపై దృష్టిసారించాలని సూచించారు. సౌరశక్తిని వినియోగించుకొని రివర్స్ ఆస్మాసిస్‌లో వర్షపునీటిని తాగునీటిగా మార్చడం, రోబో రూపకల్పన, సౌరశక్తితో చీకటిపడగానే వీధిదీపాలు వెలగడం, ప్లాస్టిక్ వ్యర్థాలతో ప్లాంటేషన్, ప్లాస్టిక్ వ్యర్థాలతో విద్యుత్ ఉత్పత్తికి రూపకల్పన చేయాలన్నారు. జాతీయస్థాయి సదస్సులతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత బయటపడుతుందన్నారు. పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నల్ల మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి నల్ల దివ్య, ప్రిన్సిపాల్ ఎంఎస్‌వీ రమేష్, ఆయా విభాగాల డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్కాజిగిరికే అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు

మంజూరు చేయిస్తానని మంత్రి తుమ్మల హామీ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

తిరుమలగిరి మార్చి 22 : మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో సీఎం కోట కింద ఇందిరమ్మ ఇళ్లను అత్యధికంగా మంజూరు చేయిస్తానని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీనిచ్చారు. తిరుమలగిరిలోని జయలక్ష్మీ గార్డెన్‌లో శుక్రవారం మల్కాజిగిరి పార్లమెంట్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్లమెంట్ నియోజకవర్గం కావడంతో తిరిగి ఈ పార్లమెంట్ సీటు నుంచి పోటీ చేస్తున్న పట్నం సునీతరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వంలో అన్ని ప్రభుత్వరంగ సంస్థలు నిర్వీర్యమయ్యాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటన్నింటినీ తిరిగి గాడిలో పెడుతామని తెలిపారు. కేంద్రంలో రాబోయేది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీని ఓడించిన కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజలదే ప్రత్యేక పాత్ర ఉందన్నారు. దేశంలోనే అతిపెద్దది మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గమని, ఈ ప్రభుత్వం సుభిక్షంగా పాలన కొనసాగాలంటే మల్కాజిగిరి పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాల్సిన అవసరం ఉందన్నారు. గడిల పాలనను బద్దలు కొట్టి ఇందిరమ్మ పాలనను తీసుకొచ్చామన్నారు. హైదరాబాద్‌కు కావాల్సిన వనరులు సాధించుకున్నామని, కంటోన్మెంట్ స్కైవేలను ఏర్పాటు చేయడానికి రక్షణ శాఖ ద్వారా అనుమతి పొందడం సీఎం రేవంత్‌రెడ్డి ఘనతగా చెప్పుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, వెన్నెల, శ్రీగణేష్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిలు పాల్గొన్నారు. అయితే బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు రంగా రవీందర్‌గుప్తాను కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఎన్నికల నియమావళిని అమలు చేయాలి

● వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర



కులకచర్లలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో వాసుచంద్ర

కులకచర్ల, మార్చి 22: ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా అమలు చేయాలని వికారాబాద్ జిల్లా ఆర్డీవో వాసుచంద్ర అన్నారు. కులకచర్లలోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు, సదుపాయాలు ఉండాలని అధికారులకు సూచించారు. మోడల్ కోడ్ అఫ్ కండక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, నీటివసతి తప్పనిసరిగా ఉండాలన్నారు. గ్రామాల్లో రాజకీయ పార్టీల నాయకుల పోస్టర్లు, గోడ పత్రాలు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

● డీఆర్‌డీవో శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో శ్రీనివాస్

మర్పల్లి, మార్చి 22: మహిళలు చిన్న, చిన్న వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఆర్‌డీవో శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో శుక్రవారం మహిళలకు కుట్టు మిషన్‌ల శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల యూనీఫాంలు కుట్టేందుకు మర్పల్లి మండలాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు కుట్టుమిషన్ శిబిరంలో శిక్షణ పొంది యూనిఫాంలు కుడితే వారికి ఉపాధి ఏర్పడినట్లు అవుతుందన్నారు. స్వయం ఉపాధి సంఘాల్లో రుణాలు పొందుతున్న మహిళలు తప్పనిసరిగా చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ స్వయంగా అభివృద్ధి చెందడంతో పాటు కుటుంబాలను పోషించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. రుణాలు తీసుకున్న మహిళలు సకాలంలో చెల్లిస్తే తిరిగి రుణం పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజమల్లయ్య, ఏపీయం మధుకర్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మేడ్చల్ టౌన్, మార్చి 22: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ సంజయ్ గాంధీనగర్‌కు చెందిన ఆషిశ్(28) వృత్తి రీత్యా వెల్డర్. తన బైక్‌పై గండిమైసమ్మ చౌరస్తా నుంచి మేడ్చల్ వైపు వస్తుండగా ఓఆర్ఆర్ సమీపంలోని కండ్లకోయ గౌడవెల్లి చౌరస్తా వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎం ఢీకొంది. దీంతో ఆషిశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతన్ని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో చెరువులో మహిళ మృతదేహం

దౌల్తాబాద్, మార్చి 22: అనుమానాస్పద స్థితిలో చెరువులో మహిళ మృతదేహం లభ్యమైంది. ఈఘటన దౌల్తాబాద్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన ఆశమ్మ(45)కు గత 25 సంవత్సరాల కిందట మద్దూర్ మండలానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. ఈ క్రమంలో ఐదేళ్ల కిందట భర్త మృతిచెందడంతో ఆశమ్మ తల్లిగారి గ్రామమైన తిమ్మాయిపల్లిలోనే ఉంటోంది. దౌల్తాబాద్‌లో శుక్రవారం వారంతపు సంతకు వెళ్తానని చెప్పిన ఆమె సాయంత్రమైనా ఇంటికి తిరిగిరాలేదు. ఇంతలో దౌల్తాబాద్ పెద్ద చెరువులో ఆమె మృతదేహం కనిపించడంతో స్థానికులు సమాచారం అందించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీశైలం యాదవ్ తెలిపారు.

కేబుల్ గోదాంలో చోరీ

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 22: ఓ కేబుల్ గోదాంలో చోరీ జరిగిన ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అడిషనల్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మండలం, అవుషాపూర్‌లోని ఓ కేబుల్ గోదాంలో గుర్తుతెలియని దుండగులు గురువారం రాత్రి రూ.7.5లక్షలు విలువచేసే నాలుగు కేబుల్ వైర్లను అపహరించుకెళ్లారు. శుక్రవారం ఉదయం విషయం తెలుసుకున్న గోదాం ఇన్‌చార్జి నరేందర్‌సింగ్ అక్కడికి చేరుకుని వాచ్‌మన్‌ను ఏం జరిగిందో అడిగి తెలుసుకున్నాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు అక్కడికి చేరుకొని కేబుల్ చోరీ జరిగిన తీరును పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అడిషనల్ సీఐ తెలిపారు.

అదుపుతప్పిన పోలీస్ వాహనం

● ఎస్ఐ, సిబ్బందికి స్వల్ప గాయాలు



అదుపు తప్పి గుంతలో పడిన పోలీసు వాహనం

బంట్వారం, మార్చి 22: మండల కేంద్రం సమీపంలో శుక్రవారం త్రుటిలో పోలీస్ వాహనంకు ప్రమాదం తప్పింది. పోలీసులు బొలెరోలో వికారాబాద్ నుంచి బంట్వారం వస్తున్న సమయంలో ముందు టైర్ పంచర్ కావడంతో అదుపు తప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లి గుంతలో పడింది. ప్రమాద సమయంలో వాహనంలో ఎస్ఐ శ్రీశైలం, సిబ్బంది ఉన్నారు. ఎస్ఐ, సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని బంట్వారం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించారు. వాహనం నెమ్మదిగా వెళ్తుండటంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై ఎస్ఐ శ్రీశైలంను వివరణ కోరగా చిన్నచిన్న గాయాలైనా అందరం క్షేమంగా ఉన్నామని తెలిపారు.

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం పట్టివేత

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 22: మద్యం విక్రయిస్తున్న కిరాణ దుకాణంపై దాడిచేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్న ఘటన పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ బి.రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపల్, అన్నోజిగూడలో గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న ఓ కిరాణ దుకాణంపై శుక్రవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 24మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిని విక్రయిస్తున్న నానావత్ మంజులను అదుపులోకి తీసుకున్నారు. పంచనామా చేసి మంజులను రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మలేషియా యూనివర్సిటీకి గ్రామీణ గిరిజన విద్యార్థి


మలేషియాలో యూనివర్సిటీ ప్రెసిడెంట్, డీన్‌తో శ్రీకాంత్

పరిగి, మార్చి 22: ఓ గిరిజన విద్యార్థికి మలేషియాలోని యూనివర్సిటీలో చదువుకునే అవకాశం దక్కింది. మండలంలోని నజీరాబాద్ తండాకుకు చెందిన గణేశ్, చంద్రిబాయి దంపతుల కుమారుడు ఎం.శ్రీకాంత్ పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నెం.01లో పదో తరగతి పూర్తి చేశాడు. శ్రీకాంత్ ఇంటర్ చదువుకునే స్తోమత లేకపోవడంతో ఓపెన్ ఇంటర్ పూర్తిచేశాడు. తర్వాత చేవెళ్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్స్ చదివాడు. ఆతర్వాత తమిళనాడులోని ఫాయర్‌బిడ్ బిజినెస్ స్కూల్‌లో పీజీడీఎంతో పాటు ఎంబీఏ చదువుతున్నాడు. శ్రీకాంత్‌కు ఎంబీఏ ఫైనల్ ఇయర్ ప్రాజెక్టులో భాగంగా మలేషియాలో చదివేందుకు అవకాశం లభించింది. శ్రీకాంత్ శుక్రవారం మలేషియాలోని ఎంఎంయూ యూనివర్సిటీకి శుక్రవారం చేరుకున్నాడు. నిరుపేద విద్యార్థికి యూనివర్సిటీ అధ్యక్షుడు, డీన్‌లు స్వాగతించి అభినందించారు.

ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలి


డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న కంకల్ గ్రామస్తులు

పూడూరు, మార్చి 22: నిలిపివేసిన ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని గ్రామస్తులు పరిగి డిపో మేనేజర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. పరిగి నుంచి షాద్‌నగర్ వయా కంకల్ మీదుగా నడవాల్సిన ఆర్టీసీ బస్సును గత నెల రోజులుగా నిలిపివేశారని తెలిపారు. కంకల్ బస్సును నిలిపివేయడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని డిపో మేనేజర్‌కు వివరించారు. వెంటనే కంకల్ గ్రామానికి బస్సు సర్వీసును పునః ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతూ వినతపత్రం అందజేశారు. డిపో మేనేజర్‌ను కలిసిన వారిలో కంకల్ గ్రామస్తులు రవీందర్, మల్లేష్, శ్రీకాంత్, గొల్ల మల్లేష్ పాల్గొన్నారు.

అన్ని దానాల్లో రక్తదానం గొప్పది


రక్తదాన శిబిరంలో ఎస్పీ, పోలీస్ సిబ్బంది

వికారాబాద్, మార్చి 22: అన్నిదానాల్లో రక్తదానం గొప్పదని జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ అన్నారు. వికారాబాద్‌లోని అంబేడ్కర్ భవనం ఆవరణలో వికారాబాద్ డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 158 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. రక్తదానం ఒక కుటుంబంలో సంతోషాన్ని ఇస్తుందన్నారు. యువకులు ఎవరైనా రక్తం అవసరమైన లేదా ఎక్కడైనా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తే రక్తదానం చేసి తమవంతు సమాజసేవ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐలు రామకృష్ణ, ఆంజనేయులు, నాగరాజు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సమీక్ష


చించోలిలో సమావేశమైన కర్ణాటక, తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులు

కొడంగల్, మార్చి 22: కర్ణాటకలోని చించోలి సబ్‌డివిజన్ అధికారులతో చించోలికి అనుసంధానంగా ఉన్న తెలంగాణ పోలీసు అధికారులు శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో దొంగతనాలు, నేరాలు, హత్యా సంఘటనలు, గంజాయి, నేరస్థుల ప్రవర్తనపై రెండు ప్రాంతాల్లో జరిగే నేర నియంత్రణ చర్యలపై సమీక్షించారు. ఈ సమావేశంలో కర్నాటక రాష్ట్రం చించోలి పోలీసు అధికారులు, తాండూర్ డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, తాండూర్ రూరల్ సీఐ అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో ఏఐ విభాగంలో ఉద్యోగావకాశాలు


కార్యక్రమంలో పాల్గొన్న రిజిస్ట్రార్ బాలాజీ, అధ్యాపకులు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 22: రానున్న రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) విభాగంలో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయని అనురాగ్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ బాలాజీ ఉట్ల తెలిపారు. మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శుక్రవారం అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్‌పై జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పోటీప్రపంచంలో సాంకేతిక ప్రాముఖ్యతను వివరించారు. క్రమశిక్షణతో ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సాయి సతీష్, మనోరంజన్‌దాస్ పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం


ట్రోఫీతో సేయింట్ పీటర్ల విద్యార్థులు

మేడ్చల్ టౌన్, మార్చి 22: క్రీడల్లో చురుగ్గా పాల్గొంటే శారీరక దారుఢ్యాన్ని పొందవచ్చని జాతీయ అథ్లెటిక్స్ మాస్టర్, సేయింట్ మార్టీన్స్, ఎంఎఎల్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాల అధిపతి జాతీయ సైకిలింగ్ క్రీడాకారులు మర్రి లక్ష్మారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ సేయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రోజమ్మ మెమోరియల్ పేరిట రెండు రోజుల పాటు ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు శుక్రవారం బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మర్రి లక్ష్మారెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రతీ సంవత్సరం తమ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించే ఆటల పోటీల్లో నగరంలోని అన్ని కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకుంటున్నారన్నారు. ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులతో పాటు గుర్తింపు పత్రాలను అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.శ్రీలత, అకాడమిక్ డైరెక్టర్ సరోజారెడ్డి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ బి.భాస్కర్‌రెడ్డి, పీఆర్‌వో రవి సుధాకర్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పీజేవీ రత్నకుమారి పాల్గొన్నారు.

రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం


రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌ను సన్మానించిన నాయకులు

బొంరాస్‌పేట్, మార్చి 22: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే ఆర్.గురునాథ్‌రెడ్డిని ప్రభుత్వం రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంతో బొంరాస్‌పేట్ మండల నాయకులు సన్మానించారు. కొడంగల్‌లో శుక్రవారం గురునాథ్‌రెడ్డిని బొంరాస్‌పేట్ మండలానికి చెందిన న్యాయవాది సంతోష్, వేణుగోపాల్, రాములు, శ్రీహరి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

వైభవంగా ఆది జగద్గురు శ్రీ రేణుకాచార్యుల జయంతి ఉత్సవాలు

కులకచర్ల, మార్చి 22: చౌడాపూర్ మండలంలోని మందిపాల్ గ్రామంలో శ్రీ ఓంకారేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం ఆది జగద్గురు శ్రీ రేణుకాచార్యుల జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వీరశైవ మత స్థాపకులు ఆది జగద్గురు శ్రీ రేణుకాచార్యుల జయంతి ఉత్సవం సందర్భంగా ఆయన చిత్రపటానికి భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు మఠం రాజశేఖర్, మందిపాల్ గ్రామ వీరశైవులు, మహిళలు పాల్గొన్నారు.

నాబార్డు వాటర్‌షెడ్ చైర్మన్‌గా లాయక్ అలీ ఎన్నిక

వికారాబాద్, మార్చి 22: నాబార్డు వాటర్ షెడ్ చైర్మన్‌గా లాయక్ అలీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రీడ్ సంస్థ మేనేజర్ నవీన్‌కుమార్ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా పాండురంగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అనితను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రీడ్ సంస్థ మేనేజర్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. నూతనంగా ఎంపికైన వాటర్‌షెడ్ చైర్మన్ రైతులకు అందుబాటులో ఉంటూ వానాకాలం సీజన్‌లో పంటల సాగుపై సలహాలు, సూచనలు చేయాలని సూచించారు. తనపై నమ్మకం ఉంచి చైర్మన్‌గా ఎంపిక చేయడంతో రైతులకు అన్నివిధాలుగా సహాయ, సహకారాలు అందిస్తానని లయఖ్‌అలీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కేసారం, చిట్టంపల్లి, సైదలీపూర్, వీర్లపల్లి గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

కొడంగల్, మార్చి 22: ఈనెల 28న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ ఆథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. శుక్రవారం కొడంగల్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలు చేశారు.

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో..

బషీరాబాద్: రాబోయే లోక్‌సభ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆయా గ్రామాల్లో బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ శుక్రవారం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. నీళ్లపల్లి, జలాల్‌పూర్, పర్వత్‌పల్లి, మాసన్‌పల్లి, కొర్విచెడ్, బషీరాబాద్‌లోని కేంద్రాలను తనిఖీ చేస్తూ వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. కేంద్రాల్లో విద్యుత్, నీటి వసతి తదితర ఏర్పాట్లపై అడిగి తెలుసుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

జలమే జీవనాధారం


కులకచర్ల ఆసుపత్రిలో మాట్లాడుతున్న వైద్యాధికారిణి మాధురి

కులకచర్ల, మార్చి 22: జలమే జీవనాధారమని, నీరు లేనిదే జీవకోటికి మనుగడ లేదని కులకచర్ల ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారిణి మాధురి అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆసుపత్రిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీటి ప్రాముఖ్యతను తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా వాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో చంద్రప్రకాశ్, వైద్య సిబ్బంది స్వరూప రాణి, విజయలక్ష్మి, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ తాండూరు పట్టణ నూతన కార్యవర్గం

తాండూరు, మార్చి 22: బీజేపీ తాండూరు పట్టణ నూతన కార్యవర్గాన్ని పట్టణ శాఖ అధ్యక్షుడు నాగారం మల్లేష్ శుక్రవారం ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ, మంతటి రాజు, కొట్ల నరేందర్‌రెడ్డి, కె.సంగమేశ్వర్, చిదిరి ప్రకాష్, శృతి, ప్రధాన కార్యదర్శులుగా అంతారం కిరణ్, మిట్టి శ్రీనివాస్, ప్రవీణ్, కార్యదర్శులుగా రాంచందర్, శివాజీ ఠాకూర్, పొల శ్రీనివాస్, అల్లకొటి బిచ్చప్ప, కావలి కృష్ణ, కోశాధికారిగా ప్రహ్లాదరావు, బీజేవైఎం అధ్యక్షులుగా తాండ్ర నరేష్, మహిళా మోర్చా అధ్యక్షులుగా అర్చన, కిసాన్ మోర్చా అధ్యక్షులుగా కె. శివకుమార్, దళిత మోర్చా అధ్యక్షులుగా ఎల్.ప్రసాద్, ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా నరేష్, గిరిజన మోర్చా అధ్యక్షులుగా శ్యామ్, మైనార్టీ అధ్యక్షులుగా షాబోద్దీన్‌ను ఎన్నుకున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు.

సేంద్రియ ఎరువులు వాడాలి


సేంద్రియ ఎరువులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ ఆదిలక్ష్మి

శామీర్‌పేట, మార్చి 22: రైతులు తమ పంటలకు సేంద్రియ ఎరువులను వాడాలని రాజేంద్రనగర్ రైతు శిక్షణ కేంద్రం సహాయ సంచాలకులు(ఏడీఏ) ఆదిలక్ష్మి సూచించారు. అలియాబాద్ పరిధిలోని రైతువేదికలో శుక్రవారం సేంద్రియ ఎరువులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రసాయనిక ఎరువులు వాడితే భూసారం తగ్గుతుందన్నారు. భూమి సారవంతంగా మారితే అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. రైతులు ఆవులను పెంచుకుంటూ వాటి పేడ, గోమూత్రంతో అద్భుతాలు సృష్టించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయవిస్తరణ అధికారి రవియాదవ్, ఎఫ్ఎస్‌సీఎస్ క్లర్క్ విజయ్‌కుమార్, రైతులు జగన్‌మోహన్‌రెడ్డి, ఎం.సంజీవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కుంట మల్లేశ్, టి.బిక్షపతి, వై.మల్లేశ్, వీరయ్యగౌడ్, కొండల్‌రెడ్డి, కిట్టురెడ్డి, కొంగ నాగులు, కిరణ్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, కృష్ణ, మల్లేష్‌యాదవ్, రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలి


చౌడాపూర్ మండలం చాకల్‌పల్లిలో మాట్లాడుతున్న నవాబుపేట ఎస్ఐ అభిషేక్‌రెడ్డి

కులకచర్ల, మార్చి 22: రాబోయే పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట ఎస్ఐ అభిషేక్‌రెడ్డి అన్నారు. రాత్రి సమస్యాత్మక గ్రామం చౌడాపూర్ మండలంలోని చాకల్‌పల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఎస్ఐ మాట్లాడారు. ప్రతీఒక్కరు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు పోకుండా తమ ఓటు హక్కును వినియోగించుకుని మంచి నాయకున్ని ఎన్నుకోవాలన్నారు. తద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఓటు హక్కు కలిగిన ప్రతీఒక్కరు పోలింగ్‌లో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చాకల్‌పల్లి గ్రామస్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ అధికారి ప్రభాకర్

కొడంగల్, మార్చి 22: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణపై అగ్నిమాపక శాఖ అధికారి ప్రభాకర్ అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యక్షంగా చూపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారాం, అధ్యాపకులు, అగ్నిమాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **కొడంగల్ రూరల్:** ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన ఏకలవ్య కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వాల్యాయి ఉషాకిరణ్‌ను నియమించాలని జిల్లా అధ్యక్షుడు ఎరుకలి రమేశ్ కోరారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా ఎరుకల జాతికి ఎన్నో సేవలు అందిస్తూ మంచి విద్యావేత్తగా గుర్తింపు పొందిన వాల్యాయి ఉషాకిరణ్‌ను నియమించడం ఉత్తమమన్నారు. ప్రభుత్వం ఏకలవ్య కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడం సంతోషదాయకం అన్నారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.ప్రీతంను శుక్రవారం ఎదులాబాద్ అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ప్రీతంను కలిసిన వారిలో ఎదులాబాద్ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు గుమ్మడి దుర్గేష్, ప్రధాన కార్యదర్శి గనుమల మల్లేష్, కోశాధికారి బద్దం శంకర్, సభ్యులు శ్రీకాంత్, బద్దం వెంకటేష్, గుమ్మడి శివ తదితరులు పాల్గొన్నారు.

● **శామీర్‌పేట:** మజీద్‌పూర్ గ్రామానికి చెందిన వల్లపు కరుణాకర్‌కు రెండు కిడ్నీలు చెడిపోయి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలిసిన తుంకి రమేశ్ తనవంతుగా రూ.20వేల ఆర్థికసాయాన్ని శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అబ్బగౌని వీరయ్యగౌడ్, మాజీ వార్డు సభ్యురాలు కోడూరి నర్మదా పాల్గొన్నారు.

● **బషీరాబాద్:** ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని నివాసంలో బషీరాబాద్ మండల సీనియర్ నేత, మాజీ వైస్ఎంపీపీ బుస్సా శంకర్‌రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బాల్య మిత్రుడు కావడంతో ఆయనను కలిసినట్లు తెలిపారు. అదేవిధంగా స్థానిక రాజకీయాలు, లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై వేం నరేందర్‌రెడ్డి ఆరా తీసినట్లు ఆయన చెప్పారు.